క్లుప్తంగా...

నేడు మాతేశ్వరి ఘటం ఎదుర్కోళ్లు

చార్మినార్: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 7న మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం మాతేశ్వరి ఘటం ఎదుర్కోళ్లు సామూహిక ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు కోట్లాఆలిజాలోని కోట మైసమ్మ ఆలయం నుంచి మాతేశ్వరి ఘటం ఎదుర్కోలు పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ముందుగా కోట మైసమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపు బయలుదేరుతుందన్నారు.

నేటి నుంచి లాల్‌దర్వాజా బోనాలు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి 115వ బోనాల ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం అమ్మవారికి అభిషేకం, 10:45 గంటలకు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ముఖ్యఅతిథులుగా హాజరై ధ్వజారోహణ, శిఖర పూజ నిర్వహించి నవరాత్రి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజేందర్‌యాదవ్ వెల్లడించారు. ఉత్సవాల్లో అమ్మవారిని ప్రతిరోజూ వివిధ రూపాల్లో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి ఆలయాన్ని ఈసారి గతానికి భిన్నంగా రంగులు వేయడంతో పాటు విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

ఉజ్జయినీ మహంకాళికి బంగారు బోనం



చార్మినార్: సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా భాగ్యనగర్ మహంకాళి బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో పాతబస్తీ గౌలిపురా కోట మైసమ్మ ఆలయం నుంచి బంగారు బోనం సామూహిక ఊరేగింపు కార్యక్రమం గురువారం పెద్ద ఎత్తున జరిగింది. గౌలిపురాలోని కోట మైసమ్మ ఆలయానికి ముందుగా పూజలు నిర్వహించిన అనంతరం జోగిని నిషా క్రాంతి బంగారు బోనాన్ని తలపై పెట్టుకొని ముందుకు నడిచారు. బంగారు బోనానికి దారి పొడవున భక్తులు మంచినీటితో సాక పోసి అడుగడుగునా స్వాగతం పలికారు. పాతబస్తీ గౌలిపురా నుంచి బయలుదేరి సికింద్రాబాద్‌లోని ఉజ్జయినీ మహంకాళికి బంగారు బోనంతో పాటు పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

నాంపల్లి: ప్రైవేట్ పాఠశాలలో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని తెలంగాణ ఉర్దూ ఫోరం అధ్యక్షుడు, బీఆర్ఎస్ మైనార్టీ విభాగం గోషామహల్ ఇన్‌చార్జి మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ అలియాస్ ఉర్దూ అన్సారీ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం హైదరాబాద్ జిల్లా డీఈఓ రోహిణిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ మహిళా ఫోరం కన్వీనర్ అర్షియా నాయిద్, నేతలు మసూద్ అలీ, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళి



గోల్కొండ: శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ భరత మాత ముద్దు బిడ్డలలో ఒకరని కార్వాన్ బీజేపీ ఓబీసీ కన్వీనర్ సుధాకర్ యాదవ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం గుడిమల్కాపూర్ జ్యోతిరావుపూలే చౌరస్తా వద్ద శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకిషన్ యాదవ్, దేవర వంశీ, శ్రీకాంత్ సాగర్, నామా యాదగిరి నేత తదితరులున్నారు.

గోవులను రక్షించుకోవాలి

గన్‌ఫౌండ్రీ: గోవును సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పలువురు వక్తలు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో సర్వోదయ గో రక్ష మంచ్ ఆధ్వర్యంలో సంకీర్త విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యులు కమలేష్‌జీ మహారాజ్ మాట్లాడుతూ.. గోవును రాజమాతగా ప్రకటించాలని కోరారు. గోమాత వల్ల కలిగే ఉపయోగాలపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గాయని గాయకులు ఆలపించి సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పూజ్యశ్రీ త్రిదండి శ్రీనివాసజీయర్ స్వామీజీ, మహా మండలేశ్వర్ ప్రభుదాస్ స్వాజీ, సభ్యులు అమృత్‌కుమార్ జైన్, జస్మిత్ పటేల్, రిదేష్ జాగిర్దార్ తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



బషీర్‌బాగ్ చౌరస్తాలో ..



వేడుకల్లో కృష్ణ, పప్పు మాత్రే, కోటి శైలేష్‌కురుమ తదితరులు

అబిడ్స్: బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. బేగంబజార్ ప్రాంతంలో ఆయన విగ్రహానికి హర్షన సేవక్ మండలి అధ్యక్షుడు ఎం.కృష్ణ, ప్రధాన కార్యదర్శి ధర్మేందర్, బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే, ప్రదీప్‌రాజ్, జగపతి సాయి, కోటి శైలేష్ కురుమ, నాగరాజ్ కల్యాణ్, వెంకటేష్, దేవేందర్, రాకేష్, నాగిరెడ్డి, శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బషీర్‌బాగ్ చౌరస్తాలో...

గన్‌ఫౌండ్రీ: జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు ఎనలేనివని బీజేఆర్ ఎడ్యూకేషన్ సొసైటీ చైర్మన్ కొమ్ముల నరేందర్ అన్నారు. గురువారం జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని బషీర్‌బాగ్ చౌరస్తాలోని బీజేఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటియువతరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రాజలింగం, దయానంద్, సునీత, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో వరద నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ అధికారులకు సూచించారు. గురువారం ఆయన తలాబ్‌చంచలం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ సమీనా బేగంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు చెప్పామన్నారు. అధికారులు సమన్వయంతోని వర్షాలకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ పర్యటనలో మజ్లిస్ పార్టీ అమన్‌నగర్-బీ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మోహినుద్దీన్, జీహెచ్ఎంసీ, జలమండలి విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



ఉజ్జయిని మహంకాళికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సాయిబాబాచారి తదితరులు

గౌలిపురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా గురువారం గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత, కోట మైసమ్మ ఆలయం తరఫున గోల్కొండ జగదాంబ అమ్మవారికి ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయ 10.30 గంటలకు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మని కైలాష్ గంగపుత్ర ఆధ్వర్యంలో ఆలయం నుంచి బయలుదేరి మధ్యాహ్నం గోల్కొండ అమ్మవారికి ఒడిబియ్యం, పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ వర్కింగ్ ప్రెసిడెంట్ కేఎస్.ఆనంద్‌రావు, సలహాదారులు జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ గిరి, ప్రధాన కార్యదర్శి సుమన్‌కుమార్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు బి.వై.శ్రీకాంత్, ప్రకాశ్, మామిడి కృష్ణ, జానకీరాం, గుండు రమేశ్, శంకర్, ప్రకాశ్, అభిలాష్ పాల్గొన్నారు.

ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి..

గోల్కొండ: సికింద్రాబాద్‌లో కొలువుదీరి ఉన్న ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి తాము 4 దశాబ్దాలుగా పట్టువస్త్రాలు సమర్పిస్తున్నామని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబా చారి అన్నారు. గురువారం ఆయన వృత్తి పని వారితో కలిసి ఉజ్జయిని మహంకాళి అమ్మవార్లకు సాంప్రదాయ పద్ధతిలో పట్టువస్త్రాలు సమర్పించారు. గోల్కొండ మహంకాళి అమ్మవారి పూజారి సురేష్ చారి, నవీన్, శివరాజ్, రవిశంకర్ తదితరులున్నారు.

వీసీని బెదిరించిన వ్యక్తి అరెస్టు

సుల్తాన్‌బజార్: తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం వీసీని బెదిరించిన ఓ వ్యక్తిపై సుల్తాన్‌బజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మధుసుధన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్మామియాబజార్‌కు చెందిన శ్రీనివాస్ యాదవ్ ఈనెల 1న కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయానికి వెళ్లి తాను సేవా కార్యక్రమాలు చేస్తున్నాని ప్రోత్సహం కోసం తనను సన్మానించాలని కోరడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మహిళా విశ్వ విద్యాలయం వీసీ ప్రొఫెసర్ విజ్ఞులత సుల్తాన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు శ్రీనివాస్ యాదవ్‌ను కోర్టులో హాజరుపరిచారు.

యువకుడి అదృశ్యం



ఫిరోజ్‌ఖాన్

విజయనగర్‌కాలనీ: యువకుడు అదృశ్యమైన ఘటన గురువారం ఆసీఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్సై మహ్మద్ జాహెద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ మురాద్‌నగర్‌లో మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ (19) కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. మెహిదీపట్నం లాల్‌బహదూర్ కళాశాలలో బికాం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల చదువులో వెనుకబడడంతో తల్లి మంచి చదువుకోవాలని మందలించింది. మనస్తాపం చెందిన ఫిరోజ్‌ఖాన్ గత నెల 30న మురాద్‌నగర్ చోటీ మసీదుకు శుక్రవారం నమాజ్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు తెలిసిన వారు, బంధుమిత్రుల వద్ద వాకాబు చేసినా ప్రయోజనం లేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పౌర సరఫరాల శాఖ సర్కిల్-02 ఏసీఎస్ఓగా చాముండేశ్వరి



చాముండేశ్వరికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న రేషన్ డీలర్ల సంఘం సభ్యులు

యాకుత్‌పురా: పౌర సరఫరాల శాఖ సర్కిల్-02 యాకుత్‌పురా ఏసీఎస్ఓగా జీవీ చాముండేశ్వరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏసీఎస్ఓగా విధులు నిర్వహించిన శ్రీనాథ్ సర్కిల్-09 సికింద్రాబాద్‌కు బదిలి కావడంతో ఆయన స్థానంలో సర్కిల్-07 ఖైరతాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న చాముండేశ్వరిని నియమిస్తూ పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు సర్కిల్ రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు ధరావత్ రాంకోటి ఆధ్వర్యంలో సభ్యులు బజరంగ్‌లాల్, నగేందర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

విజయనగర్‌కాలనీ: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సుంకరి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. టప్పాచబుత్ర అలీనగర్‌కు చెందిన కుల్సుంబీ(68) మృతిచెందినట్లు కుటుంబసభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మోదీ పాలన అమోఘం



చార్మినార్: తొమిదేళ్ల మోదీ పాలన అమోఘమని బీజేపీ రాష్ట్ర మైనార్టీ సెల్ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. గురువారం పాతబస్తీ హుస్సేనీఆలంలోని దావూది బోరా కమ్యూనిటీకి చెందిన మత పెద్దలతో ఈద్ గదీర్‌ను పురస్కరించుకొని మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రత్యేక్షంగా సమావేశమై మోదీ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. దీనిని స్వాగతించిన బోరా మత పెద్దలు ప్రపంచంలోనే దేశాన్ని అగ్రస్థానంలో మోదీ త్వరలోనే నిలపుతామంటూ ఆశాభావం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోరా మత పెద్దలు షేక్ సైపుద్దీన్ హమీద్, ముల్లా హసన్, సర్ఫరాజ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

గోల్కొండ: రాష్ట్రంలో వచ్చేది బీజేపీప్రభుత్వమేనని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఆయనను బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, కమలం పువ్వు చిత్రపటాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అవినీతి పాలనకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు పాతర పెడుతారని ఆయన అన్నారు. అవినీతి రహిత పాలన అందించే సత్తా బీజేపికే ఉందన్న విషయం ప్రజలకు తెలిసిపోయిందని, అన్ని వర్గాల ప్రజలు తెలంగాణలో బీజేపీకి మద్దతు పలుకుతున్నారన్నారు.



ట్రాన్స్‌కో ఉద్యోగిపై దాడి.. ముగ్గురు నిందితుల అరెస్ట్

విజయనగర్‌కాలనీ: విధుల్లో ఉన్న ట్రాన్స్‌కో ఉద్యోగిపై దాడిచేసిన కేసులో ముగ్గురు నిందితులను టప్పాచబుత్ర పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ సుంకరి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 30న టప్పాచబుత్ర మహబూబ్ కాలనీలో దత్తాత్రేయనగర్ ట్రాన్స్‌కో సెక్షన్ ఉద్యోగి సతీష్‌కుమార్(38) విధుల్లో ఉండగా ముగ్గురు వ్యక్తులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏడీ వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం మహబూబ్‌కాలనీకి చెందిన ఏసీ టెక్నిషియన్ మహ్మద్ అజాముద్దీన్ ఘోరి (47), అదే ప్రాంతానికి చెందిన డ్రైవర్‌గా పనిచేసే మహ్మద్ అస్లాముద్దీన్ ఘోరి(39), ఆసిఫ్‌నగర్ మల్లేపల్లి ఓల్డ్ ఫీల్‌ఖానాకు చెందిన కార్పెంటర్‌గా పనిచేసే మహ్మద్ అబ్దుల్ ఖలీమ్(31)లను అరెస్టు చేసి జైలుకు తరలించారు.

వాటర్‌బోర్డు సమస్యలను పరిష్కరిస్తాం



సీజీఎం దశరథరెడ్డితో సమావేశమైన ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: వాటర్‌బోర్డులోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని బోర్డు సీజీఎం దశరథరెడ్డి పేర్కొన్నారు. గోషామహల్ బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్ గురువారం దశరథరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. హిందీనగర్, గోడేకబర్ సెక్షన్లలో తాగునీటి సమస్యలు, లో ప్రెషర్ వస్తుందని వివరించారు. ఈ సందర్భంగా దశరథరెడ్డి మాట్లాడుతూ.. వాటర్‌బోర్డు సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అహ్మద్, అస్సద్ తదితరులు పాల్గొన్నారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ను కొలీజియం సిఫార్సు చేసిన సందర్భంగా ఆయనను కలిసి సన్మానిస్తున్న హోం శాఖ జీపీలు సామల రవీందర్, రూపేందర్, ఏజీపీలు శశిధర్‌రెడ్డి, విశ్వేశ్వర్, సాయి, లియాక్ ఉన్నీస్సా తదితరులు. – సాక్షి, సిటీబ్యూరో

సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్‌కు ఆదరణ



కోటి శైలేష్‌కురుమకు నియామకపత్రాన్ని అందజేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్‌కు జాతీయ స్థాయిలో కూడా ఆదరణ లభిస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సీనియర్ బీఆర్ఎస్ నేత కోటి శైలేష్ కురుమను నియమించి నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా బీఆర్ఎస్ పార్టీ పటిష్టంగా ఉందన్నారు. కోటి శైలేష్ కురుమ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను అందరికీ అందించేందుకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, నగర ఇన్‌చార్జ్ దాసోజీ శ్రవణ్, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పప్పుమాత్రే, జగపతి సాయి, ప్రదీప్‌రాజ్, అనిల్, టింకు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అన్ని పండగలకు సమప్రాధాన్యం



మంత్రి తలసానిని సత్కరిస్తున్న ధన్‌రాజ్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్: బీఆర్ఎస్ హయాంలో అన్ని పండగలకు సమ ప్రాధాన్యం లభిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. జాంబాగ్ డివిజన్ కో ఆర్డినేటర్, ప్రోగ్రామ్స్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన ధన్‌రాజ్ అనుచరులతో కలిసి గురువారం మంత్రి తలసానిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. కష్టించి పని చేసే వారికి బీఆర్ఎస్‌లో సముచిత స్థానం ఉంటుందన్నారు. కో ఆర్డినేటర్‌గా ధన్‌రాజ్ నియమితులు కావడంతో జాంబాగ్‌లో పార్టీ మరింత పటిష్టమవుతుందన్నారు. అనంతరం ధన్‌రాజ్ మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా జాంబాగ్ డివిజన్ ప్రజలకు సేవలందిస్తున్న తనకు కో ఆర్డినేటర్, ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ పదవిని అప్పగించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, యోగేష్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



సుల్తాన్‌బజార్: జాంబాగ్ డివిజన్‌లో కలుషిత నీటి సరఫరా జరుగుతుందని ప్రజల ఫిర్యాదు చేయడంతో కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ స్పందించారు. ఈ మేరకు గురువారం డివిజన్‌లోని పూసలబస్తీ, సిక్ గల్లీ, సమోసా గల్లీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ట్రూప్‌బజార్‌లో 18వ తాగునీటి పైప్‌లైన్ లీక్ కావడం వల్ల ఆయా ప్రాంతాల్లో నీటి కాలుష్యం ఏర్పడిందని తెలుసుకుని జలమండలి అధికారులతో మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా పైప్‌లైన్‌ను మరమ్మతులు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, నాయకులు రామకృష్ణ, రాజుయాదవ్, మోయిజ్, హరిబాయి, అరుణ్, జ్ఞానేశ్వర్, మహేష్, నర్సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ జూనోసిస్ డే



పెంపుడు జంతువుకు వ్యాక్సిన్ ఇస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్

విజయనగర్‌కాలనీ: అంతర్జాతీయ జూనోసిస్ డేను పురస్కరించుకుని గురువారం విజయనగర్ కాలనీ శాంతినగర్ పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు ఉచిత యాంటి ర్యాబిస్ టీకాలను ఇచ్చారు. ఆస్పత్రికి వచ్చిన పెంపుడు జంతువుల యజమానులకు పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ మోర విజయ్‌కుమార్ పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రోగాలను నివారించేందుకు ప్రతి సంవత్సరం జూలై 6న ఉచిత యాంటిర్యాబిస్ వ్యాక్సిన్ ఇస్తున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాలైన బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాసబ్‌ట్యాంక్, మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి తమ పెంపుడు జంతువులను తీసుకువచ్చి యజమానులు వ్యాక్సిన్లను వేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రవతి, సాయిచరణ్, పూజిత, ప్రతీత్, చరిత్, సాయి ఉమామహేష్‌తో పాటు పశు వైద్య శాల సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బుద్ధప్రసాద్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం తన రచనలతో సమాజాన్ని చైతన్య పరిచారని ఆంధ్రప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే మండలి బుద్ద ప్రసాద్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఓలేటి పార్వతీశం రచించిన ఊహల పొత్తిళ్ల నుంచి పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి పూర్వ డైరెక్టర్ రావూరి వెంకటేశ్వర్‌రావు, తెలుగు విశ్వ విద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎస్.గోపీ, సాహితీవేత్త, పాలకుర్తి మధుసుదన్ రావు, రచయిత్రి అయినంపూడి లక్ష్మి, సంస్థ కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

గోల్కొండ: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలో ఆయన కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు తెల్ల రేషన్ కార్డుదారులై ఉండాలన్నారు. అవసరమైన అన్ని ధ్రువపత్రాలతో తన కార్యాలయానికి వచ్చి తనకు అందిస్తే తానే స్వయంగా మంజూరు కోసం పంపుతానన్నారు.



టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముట్టడికి యత్నం



పీఈటీ అభ్యర్థులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

గన్‌ఫౌండ్రీ: గురుకుల పీఈటీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ గురువారం పలువురు అభ్యర్థులు నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా గురుకుల పీఈటీ ఎంపికైన అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సైదులు గౌడ్ మాట్లాడుతూ.. 2017లో 616 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, పరీక్షలో 1,232 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని గుర్తుచేశారు. కోర్టు కేసులు ముగిసి రెండేళ్లవుతున్నా సంబంధిత పోస్టులను భర్తీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆయా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడికి యత్నించిన అభ్యర్థులను పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించారు. దీంతో తీవ్ర ఉద్రికత్త చోటు చేసుకోవడంతో వారిని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు

అఫ్జల్‌గంజ్: అంకిత భావంతో పని చేసే ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని టీఎస్ ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీధర్ అన్నారు. రీజియన్ పరిధిలో వివిధ డిపోల్లో విధులు నిర్వహిస్తున్న 51 మంది ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, శ్రామికులతో పాటు ఇతర సాంకేతిక సిబ్బందికి ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఇటీవలే ఆర్టీసీ బస్‌భవన్‌లో అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా రంగారెడ్డి రీజియన్ ప్రథమ స్థానంలో నిలవడంతో గురువారం ఎంజీబీఎస్‌లో ఆర్ఎం శ్రీధర్, సీఆర్ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారికి సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.